# శనక్కై పుచ్చువ

కూచి సాయిశంకర్

'రథం వీధి' ఎప్పుడూ పడుచుపిల్ల నవ్వంత కళగా కళకళ్లాడుతూ ఉంటుంది. వరలక్ష్మీ 'శుక్కురారం' పేరంటం లోగిలంత వెలుగుతో వెలుగుతూ ఉంటుంది.

ఆ ఊర తిరిగే జనాలకి అది నిజంగా ఓ 'వాయనం వీధే'.

పేరంటాల్లో విధిగా శనగల వాయన ఆచారం. అదీ సీజన్లోనే కదా!, కానీ! రథం వీధిలో ఏటికేడూ రోజూ వాయనాలే... వాయనాలు! అలా ఇచ్చేదెవరూ, పుచ్చుకునేదెవరూ అంటే...

ఇచ్చేది 'శివయ్య'!

'పుచ్చుకునేది ఊర్లో ఆడా-మగా!!

చూశారా! ఇలా రాశానో లేదో ఇంతలో... 'ఆగెహా! ఆ వాయనాలకి అసలు సిసలు అర్హురాలిని నేనే.. ఐనా మొగోడిలా వాయనాలిస్తూ పోతే ఆడంగులు కూడా అంగళ్ళకెక్కరా ఏంటీ!' రైలు కూతంత హంగామా చేస్తూ 'గౌరమ్మ' అంఖణాలు పోయేదక్కడే, చేతనున్న జువ్వగంపలోని తాజా పూలను తుంపేస్తూ.


కథలోకొస్తే...

శివయ్య నిజంగా శివుడ్లాటోడే! చల్లనైనోడే!! 'తోపిడీ బండి' మీద 'వేపుడు శనగల... యాపారం' వాడి వ్యవహారం.

మొలకెత్తిన శనగలూ, సొంతంగా వీరమ్మచేత దంపించి చేయించుకున్న 'నషాలా కారం' (ఇది శివయ్య 'ఆవిడలాగే'!), గేదెల గవర్రాజుకి శనగల రుచి ఆశ చూపించి పోగేసిన వెన్నకాచిన 'పేరిన నెయ్యి, దొరికితే... కొత్తిమీరా, కోరుకున్నోళ్ళకు నిమ్మడొక్కలూ, ఓ కిరోసిన్ పొయ్యా, ఇనుప బూర్ల మూకుడూ, అట్లకాడా, దొప్పగరిటే, వీటన్నిట్లకీ రాజులా ఉండే ఉప్పు రాచ్చిప్పా, ఊరిచెరువు తామరాకుల దొంతా... నీలాచారి శనగల బాకీ మింజువతీ చేసిచ్చిన 'గళ్ళాపెట్టీ'... శివయ్య ఆస్తి.

ప్రొద్దుటే లేచి, కూతేసిన తీపి పుణ్యం కట్టుకున్న తన 'కోడిమారాజు'కి నాలుగ్గింజల 'దాణా' వేసి ఆనక 'సూరీడు బగమంతుడి'కి ఓ దండం పడేసి, కాలకృత్యాలు తీరుకొని, అంతకుముందే చలువచేసి ఉంచుకున్న 'నిక్కరూ - చొక్కాయీ', ముక్తాయింపుగా తలపై దుళ్ళసంతలో కొన్న ఎర్రగళ్ళ 'తుమ్మాలు' తలపాగా చుట్టి, గది మూలనున్న 'ఎండికొండ శివులోరికీ', గది ఇవతల ఓ వారగా వున్న 'తులశమ్మోరికీ' దండం పెట్టి. 'శివాః!' అంటూ వీధికెక్కిన శివయ్య బండి ఆపట్టున నాలుగు వీధులు దాటెళ్ళి రథం వీధిలోని భూషయ్య కిళ్ళీ బడ్డీకి కాస్త ఇసుంటా నిలబడుతుంది.

ఐతే! ఇక్కడో చిన్న ఒప్పందం



ఉంది! ఇది భూషయ్య మాటల్లో... 'ఇగో శివా! శనగల్లో కారం సిన్మా సూరేకాంతవంత... ఆవిడగారి నోరంత ఎక్కువుండాల! ఎంచక్కా మంట నషాలానికి పుట్టతేలు కాటులా ఎక్కాల... అప్పుడు జనాలంతా నా దుఖాణం కాడ జేరి 'ఐసుకోల్డు మజ్జిగీ' గళాసుల్లెఖన ఇరగబడి తాగుతారు! నీ దయమాల నాకూ 'బిగినెస్సు పెరుగుద్ది' అనగానే, 'ఆఁ! అలా పెజల నోళ్ళు కొట్టి, ఆళ్ళ కడుపులో మంటెట్టి మనం కడుపులో ఏసుకునేది... వణ్ణం కాదొరే... కచిక బూడిదే...' అనేంత సంస్కారి శివయ్య. ఆపై.. 'సత్తీ కాలపోడ్రా శివుడు... ఎలా బతకతాడో.. ఏటో! అనే భూషయ్య మాటకి 'ఇలానే నాయంగా... బతకతా నొరే' అంటూ బతుకుతున్న నిలువెత్తు నిజాయితీ శివయ్య.

'యాపారం' ప్రొద్దుట పది గంటలనుండి రాత్రి జయలక్ష్మి టాకీసు 'సెకండాట' వదిలేదాకా సాగుతుంది. ఈమధ్యలో అవ్వ పంపిన 'బెల్లం టీ... మద్దెన్నపేళ వణ్ణంబువ్వా... సాయంత్రపేళ నారయ్య బండిచ్చే అల్లం టీ' ఉండనే ఉన్నాయి. వాటన్నింటినీ మించిందీ... శివయ్య రోజువారీ కార్యక్రమంలో ప్రధానాంశం... ఇదిగో...

'సెప్పట్లేదేంటోసే! మా శివుడిచ్చే వాయనానికి అర్హురాలిని నేనే గందాని అడిగిన... కానీ! ఇందాకటేల నుండి సూస్తన్నా... ఓ.. రాసూపోతారు గానీ ఓపాలి సత్తెం సెప్పరే వోరూనూ...' అంటున్న 'కన్నాంబంతటి కంచుకంఠి'(!) కథ మొదట్లోనే అడ్డంకొట్టిన గౌరమ్మ.

గోదార్నీరు గొంతుదాకా ఎగపట్టించి 'ఇగో! సూసుకోండేసే నా బిడ్డరూపం' అంట లంక భూమి వంగతోట వంగమొక్క కాసిన పెద్దసైజు 'నల్లాంకాయ' రూపంది గౌరమ్మ.

'నల్లటిదైతేనేం సల్లంది – సక్కంది! మాలచ్మి బంతిపూల రథంలా కళ్ళముందు కదుల్తాంటే పొగరెక్కిన పోతురాజు కూడా అమ్మతల్లి కులుకు సూసి ఓ బుగ్గకోబుగ్గ తగులుకునేలా నొక్కుకోవాలమ్మో! మా గౌరమ్మ.. మజాకా!!' అంటుంది గౌరమ్మతో కలసిన ఆ ఊరి నీలాటి రేవులో గుమిగూడే కోకల మంద.

'మరే! నన్ను బంతిపూల రథం అన్నారుగా... నేను 'పూలే' అమ్ముతా!' అంటూ ఈడొచ్చిన 'తువ్వాయి'లా ఆ పల్లె ఒళ్ళో పూలగంపలతో పరుగులు తీస్తూ పసి నవ్వులు రువ్వుతూ తిరిగే గౌరమ్మకి ఈ వ్యాపకం కంటే బాగా నచ్చింది, ఇంకో ప్రధానమైందీ ఒకటుంది...

అదీ! శివయ్యతో శనగల బండి దగ్గర జగడం.

'ఏందయ్యో! శనగపచ్చిగుంది, ఇంకా ఏగాల... ఇంకొంచెం నెయ్యి ఎయ్యి దాని మొహాన.. మరీ అంత పీనాసితనం ఐతే ఎలాగెహే!' అని పట్టుపట్టి శివయ్యని ఏడిపించి, వెక్కిరించి తమాషా చేయడం గౌరమ్మకి అదో 'జనమ జనమాల హక్కు'.

'నా శనగ వేగుద్దో... సచ్చుద్దో నీకెందుకే! మూతిని మూడొంకర్లు తిప్పుతూ 'పూలమ్మో' అంటూ సెవికోసిన మేకలా అరుస్తూ ఈదంపట తిరక్క.. ఆ' ఇది శివయ్య ఉక్రోషం.

'ఆహా! మూడు కాదు ముప్పియ్యారు వంకర్లు తిప్పుతా... నా మూతీ – నా ఇష్టం! ఏం చేస్తావో... చేస్కో ఎహే!' అనేసి శివయ్యని మరింత ఆటపట్టించింది తుర్రుపిట్టలా రివ్వున పోయే గౌరమ్మ తీరూ... సరిగ్గా సాయంత్రం ఐదూ – ఆరు గంటల మధ్య ఏటిగట్టుకు 'ఎనకమాల' ఉన్న గంగారాయుడి మావితోపులోకీ, ముక్తేశ్వరం తొగరుపాయి అంచుకీ మధ్యన ఆగుతుంది... అక్కడే...

'ఏం దూకుడే రౌడీరంగమ్మా! ఆడి మానాన ఆడు శనగలమ్ముతా వుంటే మద్దెన నీ నసేవిటే అంట! ఐనా... ఆడి చేతి శనగల రుచేం తక్కువా... ఆడు మగమోహినీ అవుతారం.. ఆడి చేతి శనగలు అమృతవేఁ... ఇద్దిదిగో! ఇంకోపాలి శివుడోడ్ని ఆటలాడించావా... నీ జుట్టు మొదలకంటా పీసుపేసే... ఆఁ .. మరింక నీ ముందుకొచ్చి నే మాట్లాడను – పళ్ళాలమ్మ తల్లోరి మీదొట్టు...' అంటూ గోదారి నీళ్ళలో కనిపించే తన ప్రతిరూపం మాటగా తనని తానే 'కూకలేసుకుంటూన్న' వేళ... నీటనున్న గౌరమ్మ రూపు మీగ్గి ...లకరాయొచ్చి పడింది. రాయి విసిరిన రాలుగాయి ఎవరని కొరకొరా చూసింది గౌరమ్మ! నిజం.... ఆ రాలుగాయి శివయ్యే!

'ఐనా! ఎంజేపనీ!! కొట్టుని ఒటేలు రంగడికి అప్పజెప్పి నాలుగు నిముషాలు చూడ్రా తండ్రీ... కావల్సొస్తే నాలుగ్గింజలు..'

'ఆఁ...'

'ఊఁ... నాలుగు శనగ్గింజలు ముక్కు కింది గోతిలో ఏసుకోమన్నా. దానికేటంటాడూ... అన్నో! నాలుగంకే నా వంటికి సరిపడదేం... సమ్మగా... కడుపెక్కే తింటా' అంటూండగా వచ్చా నీకాడికి.. ముందు పని తెవులుద్దూ! పొద్దెక్కితే నా కొట్టు దిబ్బాదిరిగుండమేనే పిల్లో...!' గుక్క తిప్పుకోకుండా అన్నాడు శివయ్య కొంత కోపానికి మరొంత ఆరాటాన్ని కలిపి దానికి ఇంతకింతా... ప్రేమని దట్టిస్తూ.

'మరేనయ్యో! అచ్చం శనగలు వేపినట్లే మాట్లాడుతున్నావు... మాగొప్ప రాజావులే... నా బంగారు కొండా..' అన్నట్లు శివయ్యని మెచ్చుకోలు చేసింది గౌరమ్మ.

ఆటవిడుపు వుందంటే ఆ జంటకి ఆ గంట మాత్రమే.

కోనసీమ ఒడిలో చేరి స్వచ్ఛమైన ప్రేమ పలవరింతలతో పలకరింతలతో పరవశించిపోయే ఆ ప్రేమజంట ప్రతి కలయికా తమ భావి జీవితపు బంగారు గుడికి మెరుగు మేలిమే.

వారి ఒక్కొక్క కలయికలో ఒక్కొక్క మధురానుభూతిని సొంతం చేసుకుంటాయి అక్కడి చెట్లూ... పూసే కొమ్మలూ... చూసే ఆవులూ... కాసే పొదులూ... ఎగిరే పక్షులూ! వాటికీ నిలువెల్లా కళ్ళే గౌరమ్మ శివయ్యల నయిగారాలు చూసేందుకు.

'మరేం! ఆడదామా... ఇయేల్టికి శలవా!' రెట్టించి అడిగాడు శనగల శివయ్య పూల గౌరమ్మని ఓరకంట చూస్తూ...

'ఆశ! శలవెట్టుకోడానికిదేం నీ బడ్డీబండి కాదు.. ఆడెహా!' కల్పించింది గౌరమ్మ.

'బడ్డీబండంటావ్! ఛస్... దాన్లో శనగలకే కదే పిల్లా నీ మనసు అచ్చంగా తాకట్టెట్టేత్త...'


'ఔనా! నా మొహం చూడు... అసలు ఇలాంటి పూలు దొరకవనేగా నీ యాపారం మాని నా ఎనకమాల నీ యవ్వారం ... సెట్లమ్మట... గుట్లంపటా... హవ్వ... కడాకరికి ఈ గోదారి తల్లి కాలి అంచుల కాడ... నాఁ... ఎనకమాల దేవిళ్ళాడేది... ఎందుకురా శనగల శివుడూ...' గౌరమ్మ రెట్టింత.

'సర్సర్లేగానీ! పూలు ఒద్దే దొరికినయ్‌గందా... ఆవేసం ఎందుకే... ఆట మొదలెయ్యి.. ఆఁ...' ఆత్రం ఆపుకోలేక అడిగిన శివయ్య కళ్ళవంక దీక్షగా చూస్తూ... ఆపై తన కొంగు మూటని చటుక్కున విప్పి దాన్లోని నాగమల్లె పూలని గుట్టగా పోసి... 'చూశావా! నా రాణీతనం...' అన్నట్లు చూసింది గౌరమ్మ.

'అమ్మయ్యో! ఇన్ని పూలే! సెట్లని దులిపి పారేశావేందే గౌరీ!... ఐనా నేనేం తక్కువ తినలే.. చూడు...' అంటూ తల పాగాలో మూటగట్టి తెచ్చిన తామరాకు పొట్లం తీశాడు శివయ్య.

'లేత తామరాకులో చెయ్యి కాలేంత వేడిలో నెయ్యితో వేచిన శనగలు' చూస్తే గౌరమ్మ నోట్లో లాలాజలం...కట్టలు తెంపుకుంటోంది.

'కళ్ళతోనే నవిలేసేలా ఉన్నావ్! అమ్మో...





## సుభాష్‌ఘయ్ కొత్తసినిమా

ఎన్నో హిట్ మూవీస్ అందించిన సుభాష్‌ఘయ్ ఇప్పుడు 'కిస్నా' అనే సినిమా తీస్తున్నాడు. 'తాళ్'లాగా ఇది కూడా మెగాహిట్ అని బాలీవుడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ''కిస్నా ఒక పర్వతప్రాంతపు కుర్రాడి కథ. ఇప్పటివరకూ మన సినిమాల్లో బ్రిటిష్ వారిని విలన్లుగానే చూపారు. కాని ఈ సినిమాలో దీనికి విరుద్ధంగా వుంటుంది. మన దేశాన్ని ప్రేమించే ఇంగ్లీష్‌వాళ్లు ఎందరో వున్నారు. మన సంస్కృతి అంటే వాళ్ళకు ఇష్టం. నిజానికి మన దేశ సంస్కృతి మన పల్లెల్లోనే వుంది. దాన్ని చూపించాలనేదే నా తాపత్రయం'' అంటున్నాడు ఘయ్. ఈ సినిమాని హిందీ, ఇంగ్లీషుల్లో తీస్తున్నారు. ఇంగ్లీషులో దీని పేరు 'వారియర్ పొయిట్'. ఇంగ్లీష్ అమ్మాయి ఇందులో హీరోయిన్. 200 మందిని టెస్ట్ చేసిన తరువాత ఆ అమ్మాయిని ఎంపిక చేశారు. హీరోగా వివేక్ ఒబెరాయ్ నటిస్తున్నారు.

శివాc... అంటూ మా గొప్ప బేరం తల్లో... పందెం ఉందిగా... ఆట మొదలెట్టు ముందు' ఊరించాడు శివయ్య గౌరమ్మను.

గౌరమ్మ, శివయ్య కలిసి గోదారి ఇసకలో ఓ మూలగా తిష్టవేశారు. అక్కడ చేరి 'దూదుం పుల్లాట' మొదలెట్టారు. ఒకర్నొకరు ఓరకంట చూసుకుంటూ.

తడీపొడిగా ఉన్న గోదారి ఇసుకని బుల్లిపాటి పోగులా పోసి, అందులో ఓ చోట అంతకుముందే తాను సిద్ధంగా ఉంచుకున్న చిన్నపాటి ఈని పుల్లని కళ్ళు మూసుకుని ఉన్న శివయ్య వినేలా...

'దూదుంపుల్లా.. దాక్కోపిల్లా
దొరగారి కంటా.. పడకే పుల్లా...'

అని పాడుతూ ఇసుక పోగులో దాచి ... 'ఊ .. పుల్లెక్కడుందో కనిపెట్టేసే' అని సవాలు చేసింది గౌరమ్మ.

శివయ్య కొంచెంసేపు ఇసుక పోగునీ... గౌరమ్మ మొహాన్నీ మార్చిమార్చి చూసి జ్ఞాపకం వచ్చిన దేవుళ్ళందరికీ మొక్కి, ఆపై రెండు అరచేతుల్నీ, వేళ్ళ మధ్య వేళ్ళుండేలా వ్యాసపీఠంలా చేసి.. ఇసుక పోగులో ఇక్కడ దాక్కుంది పుల్లని చెప్పేలా ఇసుక పోగుపై కలిసున్న చేతులతో మూసేశాడు.

ఇక ఇదీ పందెం వేసే సమయం 'శనక్కో పువ్వు... నాగమల్లె పువ్వు' అంటూ. ఇందుకు సాక్షులు గుట్ట – చెట్టు... మీదున్న పిట్టా! ఎదుటనున్న గోదారీ... దాన్లోంచి అప్పుడప్పుడు తలెత్తి చూసే కుర్ర చేపా!

శివయ్య చేతులతో మూసిన జాగా మాత్రం ఉంచి మిగతా ఇసుక గుట్టని అటూ, ఇటూ కూడా తిరగదోడేసింది గౌరమ్మ పుల్లకోసం. శివయ్య ఎకసెక్కెం చేసేవాడు. గౌరమ్మ... ఓc... ఉడుక్కునేది...

పుల్ల దొరికితే గౌరమ్మకు దొరికేది... లేదా శివయ్య చేతి పట్టులోంచి తొంగిచూసేది... చిత్రమేమిటంటే! గెలుపోటములు ఇద్దరివైపూ సమవుజ్జీగా తిరిగేవి... ఒకరి చేతిలో ఒకరు ఓడిపోవాలనేకంటే.. ఎదుటి వాళ్ళే గెలవాలన్న అంతరంగాల ఆలోచన వారిద్దరి కళ్ళలో ప్రస్ఫుటమై కనపడేదిక్కడే.

ఫలితం ఎటున్నా... శనక్కోపువ్వు... లేదా పువ్వుకో శనగా. వారిద్దరి ఆటతీరు 'అద్వైతంగా' సాగేదలానే.. తుళ్ళింతల కేరింతలతో.

నవ్వులూ – రవ్వలూ, ఉద్వేగాలూ – ఉక్రోషాలూ, పలకరింతలూ – పరవశాలూ వంటి అనేకానేక జంట విన్యాసాలు ఆ జంట మధ్యన చేరి కన్నుల పంటే ఆ సమయం.

మొత్తానికి హోరాహోరీనే జరిగిన ఆటలో ఇద్దరిదీ గెలుపే... ఇద్దరిదీ ఓటమే... కానీ! ఇద్దరికీ పండగే!!

పైకిమాత్రం 'పెద్ద గొప్పే! ఎప్పుడైనా ఒక నాగమల్లె పువ్వు మిగిలితే తల్లో ఎట్టుకుందామనుకొన్నా.. మిగలనిత్తేగా ఈ మారాజు.. పెద్ద బడాయి' అని మూతిని 'అష్టాంకర్లూ' తిప్పి వగలు పోయేది గౌరమ్మ.

'ఆc ... సర్సర్లే! కొట్టుకాడ పన్లోపడి అందరూ పొగిడే నా శనగల్ని అక్కడెలానూ తినడంలే... ఇక్కడైనా తిందావంటే ఇదిగో.. ఒక్కటైనా మిగలనీకుండా నీ వరసిదీ...' అంటూ 'తుమ్మాలు' దులిపి పైకి లేచాడు శివయ్య.

'అంటే! ఏంటంటా... ఇంటికెళ్ళిపోవాలా... కొట్టుకాడ కూకోవాలా... ఏంది కత...'

'ఆ ఎళ్ళక... ఇలా పొద్దత్తమానూ నీ కాలాన్ని శనగబుద్దల్లా నవిలేత్తే రేపటి ఆటకి చేరినట్టే... నే పోతా!' అంటూ వెళ్ళబోతున్న శివయ్య చేతిని వాటంగా పట్టుకొని తనవంక లాక్కొంది గౌరమ్మ కొంటెగా.

లాగడమైతే లాగింది కానీ! 'ఇదిగిదిగో... దొర జాంపండులా... ఇలా వచ్చి ఒళ్ళో పడ్డాగా... చిలకలా కథ నడిపించు' అన్నట్లు కోరమీసం సవరతీస్తూ కొంటెగా చూసే శివయ్య చూపుకి సిగ్గుల సింగారమైంది గౌరమ్మ.

'ఇగో! దొంగకానా! ఎల్తే వద్దంటావ్c.. ఉంటే ఏవిత్తావ్.. ఇయ్యేల్టికి కథా... కమామీసూ హుళక్కేనా... ఏంటే!' సిగ్గుమొగ్గలౌతున్న గౌరమ్మ కళ్ళలో కళ్ళుపెట్టి... సైగచేస్తూ మీదమీదకు వెళ్తున్నాడు శివయ్య.

'ఓలమ్మో! కదా... కమామీసూనా... అలాంటివేం లేవు... కావాల్నంటే ఇయిగో నీ గెలుపు సొత్తు' అని తాత తామరాకులో కట్టిన నాగమల్లె పూల పొట్లాన్ని శివయ్య చేతికి అందించి, ... ఆనక నాలుగు వేపుడు శనగల్ని అతని నోటికందించి 'అర్థమైందిగా... ఇదీ కథ!' అని నవ్వేసింది 'శివుడి గౌరమ్మ'.

'అలాగేం! ఐనా ఇంకెక్కడైందీ కథ...' అంటూ ఓ నాగమల్లె పువ్వుని అందుకొని, దానికి మనసారా ముద్దుపెట్టి... ఆ పువ్వుని ముచ్చటగా మూడుసార్లు గౌరమ్మ మొహం చుట్టూ తిప్పి.. ఆమె వాలుజడలో వాటంగా పెట్టి... 'ఇదే కథ!' అన్నాడు 'గౌరమ్మ శివుడు' నోటనున్న శనగల రుచి అనుభవిస్తూ....

ఎన్నిసార్లు చూసినా ఇది 'భలే కథే!' అనుకొని మురిసిపోతుంది గోదారిసీమ.